అభాగ్యుల జీవితాల్లో జగనన్న వెలుగు

● పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



వెల్దుర్తిలో పింఛన్లను అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): అవసాన దశలో ఉన్న అవ్వాతాతలకు, ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన వితంతువులకు, అవయవలోపంతో బాధ పడుతున్న అభాగ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కుల, మత, రాజకీయాలకు తావు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3,000 వేలు చేసిన ఘనత జగనన్నదే అన్నారు. అందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని ప్రజలను కోరారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన అంగన్‌వాడీ ఆయా దస్తగిరమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, బ్రహ్మగుండం చైర్మన్ పెద్దిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి వెంకట్‌నాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు.

– వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, బీటీ నాయుడు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది నాయక్, రవి తదితరులు నూతన పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా పోటీలలో గ్రామం నుంచి మండలానికి ఎంపికైన 100 మంది క్రీడాకారులకు టీషర్టులు, టోపీలు అందించారు.

– హొళగుంద: వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మండలంలో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. మండలానికి కొత్తగా మంజూరైన 80 మందికి మంజూరు పత్రాలతో పాటు రూ.3 వేల పింఛన్ అందజేసినట్లు ఎంపీడీఓ సుభాషిణి తెలిపారు.

జగనన్న ఇచ్చిన మాటను నెరవేర్చారు



దేవనకొండలో పింఛన్లను అందజేస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి

దేవనకొండ: ఇచ్చిన మాట ప్రకారం జగనన్న పింఛన్ పెంచారని దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం కొత్తగా మంజూరైన 154 మంది పింఛన్‌దారులకు పింఛన్ అందజేశారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించుకుందామని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మల్లికార్జున, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, నాయకులు లుముంబా, రాజారెడ్డి, దివాకర్‌నాయుడు, ప్రేమనాథ్‌రెడ్డి, రాఘవేంద్ర, తెర్నెకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి..



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పెద్ద పరశన్నకు పింఛన్ అందజేస్తున్న వంటీర్ వీరేష్

నందవరం: మండల పరిధిలోని గురజాల గ్రామానికి చెందిన కురవ పెద్ద పరశన్న అనారోగ్యంతో కర్నూలు పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ వీరేష్ శనివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము రూ.3 వేలు అందజేయడంతో పింఛన్‌దారుడి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

పింఛన్లు పంపిణీ



గోనెగండ్లలో బడేసాకు వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ బగిలి రఫీ

గోనెగండ్ల: మండలంలో 50 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో వందశాతం పూర్తి చేస్తామన్నారు.

కర్ణాటకకు వెళ్లి పింఛన్ అందజేత



బళ్లారి ఆస్పత్రిలో చిన్న హనుమంతుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

హాలహర్వి: కర్ణాటక రాష్ట్రం బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హాలహర్వికి చెందిన చిన్నహనుమంతుకు శనివారం వలంటీర్ గంగాధర్ అక్కడికే వెళ్లి పింఛన్ అందజేశారు. దీంతో పింఛన్‌దారుడు, వారి కుటుంబ సభ్యులు వలంటీర్ గంగాధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హొళగుంద ఎస్‌ఐ బదిలీ

హొళగుంద: స్థానిక ఎస్‌ఐ వల్లెపు శ్రీనివాసులును బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఆరు నెలల క్రితమే ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఇతడిని బదిలీ చేసినట్లు సమాచారం. పోస్టింగ్ కోసం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల వద్ద రిపోర్ట్ చేసుకోవాలని అధికారులు ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా ఇక్కడికి ఇంకా ఎవరినీ నియమించలేదు.

నిత్యావసర సరుకుల పంపిణీ

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి, హొళగుంద గ్రామాలకు చెందిన అనాథ వృద్ధులు, దివ్యాంగులకు శనివారం ఆదోని వివేకానంద సేవా సంస్థ, భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వీరికి ప్రతి నెలా నిత్యవసర సరుకులు, ఇతర సహాయసహకారాలు అందజేస్తామని స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, సిద్ధార్థగౌడ్ తెలిపారు.

మార్కెట్ ధరకే కందుల కొనుగోలు

మద్దికెర: బహిరంగ మార్కెట్ ధరకే కందులను నాఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఏఓ రవి తెలిపారు. శనివార ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులు కందులు విక్రయించుకోవచ్చన్నారు. వారంలోపు బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అవుతుందన్నారు. గోనె సంచులు, రవాణాచార్జీలు కూడా ఉచితమన్నారు. ఈ అవకాశాన్ని కంది రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

తుగ్గలి: మండల పరిధిలోని రాంపల్లి కొండల్లో నాటుసారా బట్టీలపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 2వేల లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన సుధాకర్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అతన్ని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ మల్లికార్జున లిపారు.

క్లుప్తంగా

శ్రీరంగనాథునికి ప్రత్యేక పూజలు



పల్లకీలో కొలువుతీరిన స్వామివారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన ప్రసిద్ధి శ్రీరంగనాథస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి బిందె సేవ, అష్టోత్తరనామార్చన, అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరంగనాథుడు శ్రీదేవి, భూదేవి సమేతుడై పల్లకీలో ఆలయ ప్రదక్షిణలు చేశారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ దస్తగిరిగౌడ్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి

కృష్ణగిరి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా చంద్రశేఖర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సురేశ్ వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో కర్నూల టూటౌన్ ఎస్‌ఐ ఎం చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, సీఐ సురేశ్ కుమార్ రెడ్డిను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఫైలేరియాపై అవగాహన



రక్త పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర: ఫైలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 మందికి ఫైలేరియా పరీక్షలు చేశామన్నారు. ఫైలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమకాటు నుంచి రక్షణకు దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను కాపాడుకోవాలి



స్వామి వారి జ్ఞాపికను అందుకుంటున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సావిత్రమ్మ

మద్దికెర: ఆలయాలను కాపాడుకోవడం ప్రతి హిందువు ధర్మమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సావిత్రమ్మ అన్నారు. శనివారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆమె పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు విజయ్.. స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. ఆలయం అభివృద్ధికి, శిలా మండపం నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.


భక్తిశ్రద్ధలతో భవానీ స్వాముల ఇరుముడి



ఇరుముడి కార్యక్రమంలో భవానీ స్వాములు

చిప్పగిరి: మండలంలోని గుమ్మనూరు గ్రామంలో ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ భవాని స్వామి ఆధ్వర్యంలో శనివారం భవానీ స్వాముల ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భవాని మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భవానీ స్వాములు, శ్రీధర్, బాలాజీ, కమలమ్మ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



కర్నూలు పెద్దాస్పత్రిలో పరమేషప్పకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఈరమ్మ

ఎమ్మిగనూరు టౌన్: స్థానిక ఎంఎస్ నగర్‌కు చెందిన గడిగె పరమేషప్ప 15 రోజుల క్రితం పక్షవాతంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఈరమ్మ శనివారం ఆస్పత్రికి వెళ్లి రూ.3 వేల చేనేత పింఛన్ అందజేయడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు



జొన్నగిరిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న రామ భక్తులు



పెనుమాడ రామాలయంలో అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న పూజారి

తుగ్గలి: అయోధ్య రామ మందిర అక్షింతలు ఎంతో పవిత్రమైనవని ప్రతి ఇంటి పూజ గదిలో ఉంచుకోవాలని విశ్వహిందూ పరిషత్ సభ్యుడు గిడ్డయ్య సూచించారు. అయోధ్య నుంచి వచ్చిన రామయ్య అక్షింతలను శనివారం జొన్నగిరిలో రామభక్తులతో కలిసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈనెల 22న అయోధ్య రామయ్య ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో దీపాలు వెలిగించాలన్నారు.

కృష్ణగిరి: ఈనెల 22న అయోధ్యలో సీతా, రామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాల ప్రాణప్రతిష్ఠ సందర్భాన్ని ప్రతి హిందువు పండుగలా జరుపుకోవాలని పలువురు కోరారు. వెల్దుర్తి మండలం రామళ్లకోట, కృష్ణగిరి మండలం పెదుమాడ గ్రామాల్లో శనివారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను, కరపత్రాలను ఇంటింటికి పంచిపెట్టారు. ప్రతిష్ఠ రోజున ప్రతి ఇంటా దీపోత్సవం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేసి, ఇష్టదైవాలకు అక్షింతలతో ఆధ్యాత్మికతను చాటుకోవాలని సూచించారు.



దాత కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

ఏకాగ్రతతో చదవాలి

● డీఈఓ రంగారెడ్డి



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న డీఈఓ

హొళగుంద: ఏకాగ్రతతో అధికమార్కులు సులభంగా తెచ్చుకోవచ్చని జిల్లా విద్యాధికారి రంగారెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థి మిక్కిలినేని వెంకటశివప్రసాద్, ఆయన కుమార్తె దీప్తి రూ.2.50 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంకును డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్ట పడి చదవాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఒత్తిడికి లోను కాకూడదన్నారు. సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేయడం వల్ల పాఠశాలలో ఉర్దూ, కన్నడ మీడియం విద్యార్థుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, త్వరలో సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. ట్యాంక్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన దాతలను అభినందించారు. దాత వెంకటశివప్రసాద్ కూతురు దీప్తి మాట్లాడుతూ 2023–24 పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.50 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఆదోని డిప్యూటీ ఈఓ రమణారెడ్డి, ఎంఈఓ సత్యనానాయణ, జగన్నాథం, ఎస్‌బీఐ మేనేజర్ సతీష్, హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ తదితరులు దాత కుటుంబ సభ్యులను సత్కరించారు.


పథకాలు వినియోగించుకోవాలి



గురజాలలో స్ప్రే డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల అధికారులు

నందవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను వినియోగించుకుని లబ్ధిపొందాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. శనివారం మండల పరిధిలోని గురజాల, మిట్టసోమపురం గ్రామాల్లో సర్పంచులు వీరస్వామి, లక్ష్మి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే ఆయుష్మాన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, పౌష్టికాహారం తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 17 రకాల సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించి పథకాలు, రాయితీలపై అవగాహన కల్పించారు. రైతులకు పంటలపైన స్ప్రే డ్రోన్‌లపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రఘునాథ్, ఏఈఓ సురేంద్రగౌడ్, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల్లో డీఎంహెచ్‌ఓ

కల్లూరు: వాతావరణంలో మార్పులతో కలిగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య వైద్య సిబ్బందికి ఆదేశించారు. శనివారం కల్లూరు మండలం పర్ల గ్రామంలోని సచివాలయం–2, కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని సచివాలయం–1లో జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీసీ, ఆరోగ్య శ్రీ, కంటి వెలుగు తదితర వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులను గుర్తించి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. అనంతరం ఆయా సచివాలయాల్లో రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం మిషన్ల పనితీరుపై అవగాహన

హాలహర్వి: మండలంలోని సిద్ధాపురం, బల్లూరు, అమృతాపురం గ్రామాల్లో శనివారం ఈవీఎంలు పనిచేసే విధానంపై జూనియర్ అసిస్టెంట్ మల్లేష్, వీఆర్వో తిప్పన్నల ఆధ్వర్యంలో ప్రజలకు, యువకులకు, రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు.

దేవనకొండలో చోరీ

దేవనకొండ: మండల కేంద్రంలోని తిక్కతాత దర్గా సమీపంలో నివాసముంటున్న ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ జగ్గాపురం మజీద్ ఇంట్లో శనివారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో చోరీ జరిగింది. 8 తులాల బంగారం, రూ.29 వేల నగదు, 30 తులాల వెండి చోరీకి గురైంది. బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ భూపాలుడు ఘటనా స్థలానికి చేరుకుని, కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. త్వరలోనే నిందితుల్ని పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

నలుగురు యువకులకు గాయాలు

ఆలూరు రూరల్: బైక్ అదుపుతప్పి కిందపడిన ప్రమాదంలో నలుగురు యువకులకు గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. ఆస్పరి మండలం జొహరాపురం గ్రామానికి చెందిన యువకులు శనివారం కర్ణాటకలోని జాళహాళ్ గ్రామంలో శుభకార్యానికి వెళ్లి వస్తుండగా హత్తిబెళగల్ గ్రామ చెరువు వద్ద బైక్ అదుపుతప్పి బ్రిడ్జి కిందపడ్డారు. గ్రామస్తులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు ప్రథమ చికిత్స అందించారు. శేఖర్ అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఆదోని ఆస్పత్రికి రెఫర్ చేశారు.

బొందిమడుగులలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగులలో శనివారం సాయంత్రం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎంపీడీఓ సావిత్రి వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పంచాతీయ కార్యదర్శి రామాంజనేయులు, వీఆర్వో భార్గవ్ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

ఆలూరు రూరల్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన మండలంలోని హులేబీడు గ్రామ ఎంపీపీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు వేసే విధంగా భద్రత కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ఓబులేసు ఉన్నారు.

వెల్దుర్తిలో నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం ఉంటుందని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, విద్యావేత్త వావిలాల కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వెల్దుర్తి జెడ్పీ హైస్కూల్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు చదివిన ప్రతి పూర్వ విద్యార్థి ఆహ్వానితులేనన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



నందవరంలో క్రీడాదుస్తులను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య



ఆలూరులో క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ అల్లబకాష్

నందవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు క్రీడా దుస్తులను ఎంపీడీఓ దశరథరామయ్య శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడకారులకు ప్రభుత్వం ఉచితంగా టీషర్టు, టోపీలను అందిస్తుందన్నారు. మండలంలో 19 గ్రామ సచివాలయాలకు క్రీడా దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, పంచాయతీ కార్యదర్శులు పెద్దిరెడ్డి, రామారావు పాల్గొన్నారు.

ఆలూరులో..

ఆలూరు: ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్న మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలలో పాల్గొననున్న క్రీడకారులకు శనివారం ఎంపీడీఓ అల్లబకాష్ టీషర్ట్‌లు, టోపీలు అందజేశారు. సమావేశంలో పీఈటీలు కవిరాజ్, చిన్నబాబు, గుత్తినాగరాజ్ పాల్గొన్నారు.

4న విజయవాడలో గ్రామీణ వైద్యుల మహాసభ

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ వైద్యుల సంఘాల సమాఖ్య (ఫెడరేషన్) ఆధ్వర్యంలో విజయవాడలో వచ్చే నెల (ఫిబ్రవరి) 4వ తేదీన గ్రామీణ వైద్యుల మహాసభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామీణ వైద్యుల పోరాట సభ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి చెప్పారు. శనివారం స్థానిక బుధవారపేటలోని పద్మచంద్ర నర్సింగ్ కళాశాల ఆడిటోరియంలో కర్నూలు జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాసభ, క్యాన్సర్‌పై పోరాట సభ పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీన గ్రామీణ వైద్యులందరూ విజయవాడ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తెలకపల్లి రాధాకృష్ణయ్య, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు/నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగేశ్వర రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉస్మాన్, దస్తగిరి పర్ల, ఇల్లూరు నరసింహ, రఘునాథరెడ్డి, నాగేశ్వరరావు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

మెరుగు'బడి'

– నాడు–నేడు పనులతో పాఠశాలలకు సరికొత్త రూపు



నాడు : కృష్ణగిరిలోని మొయిన్ స్కూల్



నేడు : ఆకర్షణీయంగా కృష్ణగిరి మొయిన్ స్కూల్

కృష్ణగిరి: గత టీడీపీ ప్రభుత్వంలో పాఠశాలల నిర్వహణ అధ్వానంగా ఉండేది. ఉన్న వసతులతోనే ప్రభుత్వ పాఠశాలలను కొనసాగించేవారు. దీంతో ఎక్కువ మంది తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు పంపి చదివించుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపరేఖలు మార్చారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా నాడు–నేడు పథకంతో రూ.వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో 9 రకాల పనులు చేపట్టి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం విడుదల చేసిన ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేసి, విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటైన కమిటీల పర్యవేక్షణలో పనులు నాణ్యతగా చేపట్టారు. దీంతో ఏ గ్రామానికెళ్లినా ప్రభుత్వ పాఠశాలలు ఆకట్టుకుంటున్నాయి.

పాఠశాల రూపురేఖలు మారిపోయాయి



మూడేళ్ల కిందట మా పాఠశాలకు పిల్లలను పంపాలంటే ఆలోచించేవాళ్లం. పాఠశాలలోని ఒక గది పూర్తిగా శిథిలమై ఉండేది. దీనికితోడు ఉన్న గదులకు వెంటిలేషన్ లేక పిల్లలు ఇబ్బందులు పడేవారు. జగనన్న ప్రభుత్వంలో నాడు–నేడు కింద చేపట్టిన పనులను చూసేత్ అసలు ఇది మా ఊరు పాఠశాలేనా అనిపిస్తుంది. పాఠశాలను సుందరగా తీర్చిదిడమే కాకుండా విద్యార్థులను ఆకర్షించేలా బొమ్మలు, గదుల్లో శ్లోకాలు, టేబుల్స్ రాయించారు. వీటన్నింటినీ చూస్తే కార్పొరేట్ పాఠశాలలా అనిపిస్తుంది.

– పాండురంగస్వామి, విద్యార్థి తండ్రి, కృష్ణగిరి